సాక్షి నంద్యాల

శనివారం । 20 । జనవరి । 2024



శాస్త్రోక్తంగా ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. శ్రీశైల గ్రామ దేవత అంకాళమ్మకు విశేష పూజలు జరిపారు.



రూ.లక్ష విరాళం

శ్రీశైలంటెంపుల్: అన్నప్రసాద వితరణ పథకానికి కర్నూలుకు చెందిన బి.శివనాగమ్మ కుటుంబ సభ్యులు రూ.1,00,116 విరాళాన్ని ఆలయ పర్యవేక్షకులు జి.స్వాములుకు అందజేశారు.



తల్లిని హతమార్చిన కొడుకు

ఆస్తి కోసం ఓ కుమారుడు కన్నతల్లినే కడతేర్చాడు. ఈ దారుణం తుగ్గలి మండలం రాతనకొత్తూరులో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. 8లో▸

న్యూస్‌రీల్

25న అరుణాచలానికి ప్రత్యేక బస్సు

నంద్యాలటౌన్: నంద్యాల నుంచి అరుణాచల క్షేత్రానికి ఈ నెల 24వ తేదీన ప్రత్యేక సూపర్ లగ్జరీ సర్వీసు ఏర్పాటు చేసినట్లు నంద్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధరరావు తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ ప్రతి పౌర్ణమికి ప్రయాణికుల సౌకర్యార్థం అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు నడుపుతున్నామన్నారు. ఈ సర్వీసు గురువారం ఉదయం 6 గంటకు నంద్యాల నుంచి బయలుదేరి కాణిపాకం మీదుగా రాత్రికి అరుణాచలం చేరుకుంటుందన్నారు. గిరిప్రదక్షిణ అనంతరం మరుసటి రోజు శుక్రవారం సాయంత్రం అరుణాచలం నుంచి బయలుదేరి వేలూరు మీదుగా నంద్యాల చేరుకుంటుందన్నారు. కాణిపాకం, వేలూరు స్వర్ణదేవాలయాల్లో భక్తులు దర్శనం చేసుకోవడానికి వీలుగా బస్సును ఆయా క్షేత్రాల్లో నిలుపుతామన్నారు. ఈ సర్వీసుకు సంబంధించిన టికెట్లను బస్టాండ్‌లోని రిజర్వేషన్ కౌంటర్, apsrtc online.inలో బుక్ చేసుకోవచ్చన్నారు.

నేడు 11 కేంద్రాల్లో నవోదయ ప్రవేశ పరీక్ష

నంద్యాల(న్యూటౌన్): నవోదయ విద్యాలయాల్లో 2024–25 విద్యాసంవత్సరానికి 6వ తరగతి ప్రవేశాలకు ఈనెల 20న శనివారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవోదయ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. నంద్యాల జిల్లాలో 11 సెంటర్లు ఏర్పాటు చేయగా 2,139 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నట్లు తెలిపారు. శనివారం ఉదయం 11.30 గంటల నుంచి పరీక్ష ప్రారంభమవుతుందని, ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష రాసేందుకు అనుమతి ఉండదన్నారు. హాల్‌టికెట్లను https://navodaya.gov.in/nvs/en/Home1 వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పరీక్ష నిర్వహణకు సంబంధించి 11 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 11మంది సెంటర్ లెవెల్ అబ్జర్వర్లను నియమించినట్లు తెలిపారు.

గొప్ప ప్రజాకవి యోగివేమన



యోగి వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: యోగివేమన గొప్ప ప్రజాకవి, సంఘసంస్కర్త అని నంద్యాల జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి కొనియాడారు. శుక్రవారం వేమన జయంతి వేడుకలను ఎస్పీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేమన చిత్రపటానికి ఎస్పీ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ జిల్లా గండికోటలో జన్మించిన వేమన భారత దేశంలోనే ప్రసిద్ధ కవిగా ఎదిగారని వివరించారు. ఆయన రాసే కవితలు సరళమైన బాషతో అందరికీ అర్థమయ్యేలా ఉంటాయన్నారు. ఆయన పద్యాల్లో ఎన్నో నీతులు దాగి ఉంటాయని మరి కొన్ని జీవిత సత్యాలు బోధించేలా ఉంటాయని వివరించారు.

అహోబిలేశుడికి విశేష పూజలు



కృష్ణాపురంలో ఊరేగుతున్న ఉత్సవ పల్లకీ

ఆళ్లగడ్డ: అహోబిలేశుడి పారువేట పల్లకీ శుక్రవారం ఆర్.కృష్ణాపురంలో కొలువుదీరింది. గ్రామానికి చేరుకున్న శ్రీజ్వాలనృసింహస్వామి, ప్రహ్లాదవరదస్వాముల ఉత్సవ పల్లకీకి గ్రామపెద్దల ఆధ్వర్యంలో భక్తులు స్వాగతం పలికారు. అర్చకులు శాస్త్రోక్తంగా నైవేద్యం తీసుకెళ్లి ఉత్సవ మూర్తులకు నివేదించారు. అనంతరం గ్రామస్తులు పల్లకీని భుజాలపై మోసుకుంటూ గ్రామంలోని తెలుపులపై కొలువుంచి పూజలు నిర్వహించారు. స్వామి రాకతో గ్రామంలో తిరునాల వాతవరణం నెలకొంది. కుల, మతాలకు అతీతంగా స్వామిని దర్శించుకుని ముక్కులు తీర్చుకున్నారు. ఉత్సవ పల్లకీ శనివారం ఉదయం కోటకందుకూరు గ్రామానికి చేరుకుంటుంది.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..

- 93 ఏళ్ల తర్వాత కులగణన సర్వే
- మొదటి రోజు జిల్లా వ్యాప్తంగా 31,129 మంది వివరాల సేకరణ
- గణనలో ప్రజల ఆర్థిక, సామాజిక స్థితిగతులు నమోదు
- సచివాలయాల సిబ్బంది, వలంటీర్ల ఆధ్వర్యంలో పారదర్శకంగా ప్రక్రియ
- పదిరోజుల పాటు ఇళ్ల వద్దనే కులగణన
- సర్వే కోసం ప్రత్యేకంగా యాప్



నందికొట్కూరు మండలం నాగటూరులో సచివాలయ సిబ్బంది, వలంటీరు కులగణన సర్వే నిర్వహిస్తుండగా పర్యవేక్షిస్తున్న ఈఓఆర్డీ సంజన్న

నంద్యాల(అర్బన్): అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కులగణనను శుక్రవారం శ్రీకారం చుట్టింది. నంద్యాల జిల్లా వ్యాప్తంగా 29 మండలాల్లో 5.95 లక్షల కుటుంబాలు ఉండగా మొదటి రోజు 15,471 కుటుంబాలను సర్వే చేశారు. జిల్లా పరిధిలో 516 సచివాలయాలు ఉండగా 469 సచివాలయాల్లో పరిధిలో సర్వే ప్రారంభమైంది. సాంకేతిక సమస్యల కారణంగా 47 సచివాలయాల్లో కుల గణన ప్రారంభం కాలేదు. మొదటి రోజు జిల్లా వ్యాప్తంగా 31,129 మంది వివరాలను సేకరించి యాప్‌లో నమోదు చేశారు. జనాభా ప్రాతిపదికన సంక్షేమ పథకాలు అందించేందుకు ఈ గణన ఎంతో దోహదపడుతుంది. సచివాలయాల పరిధిలో జరిగే ఈ సర్వేలో కుటుంబ సభ్యుల విద్య, ఆర్థిక, సామాజిక పరిస్థితి, కులం, ఉప కులం వంటి వివరాలు ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు. దేశంలో 1872లో తొలిసారిగా జనగణన ప్రారంభమైంది. ఆ తర్వాత ప్రతి పదేళ్లకు చేపడుతున్నారు. ఇందులో భాగంగానే కులగణన జరిగేది. చివరిసారిగా పూర్తి స్థాయిలో 1931లో కులగణనతో కూడిన జనగణన జరిగింది. స్వాతంత్ర్యానంతరం 1951 నుంచి జరిగిన ఏ జనగణనలోను పూర్తి స్థాయిలో కులగణన చేయలేదు. ఎస్సీ, ఎస్టీలను మినహాయించి మిగిలిన వారి గణన కులాల వారీగా చేయడం లేదు. మిగిలిన వారందరినీ జనరల్ కేటగిరీ కింద నమోదు చేస్తూ వస్తున్నారు. కులాల వారీ జనాభా, వారి ప్రస్తుత సామాజిక, విద్య ఆర్థిక పురోభివృద్ధి తెలుసుకుని సముచిత విధాన నిర్ణయాలు తీసుకోవడానికి, పథకాల రూపకల్పనకు ఉపయోగపడుతుంది. అర్హత ఉండీ సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి లబ్ధి చేకూర్చడం, సామాజిక న్యాయాన్ని సాధించి సమ సమాజ స్థాపనకు దోహద పడుతుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సంకల్పం సామాజిక న్యాయానికి కట్టుబడి సమాజంలోని పేద, బడుగు బలహీన వర్గాల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ దేశానికే ఆదర్శప్రాయంగా నిలుస్తోంది. వెనుకబడిన తరగతులను వెన్నెముక తరగతులుగా గుర్తించి వారి సంక్షేమం, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. సమాజంలో అన్ని కులాలు, వర్గాల వారికి అభివృద్ధి ఫలాలు దామాషా పద్ధతిలో అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కులగణనకు శ్రీకారం చుట్టింది. ఈ సర్వే ఈనెల 28వ తేదీ వరకు కొనసాగుతుంది. సర్వేలో ఏ కుటుంబమైనా కవర్ కాకపోతే వారి వివరాలను జనవరి 29 నుంచి ఫిబ్రవరి 0వ తేదీ వరకు సేకరిస్తారు. ఫిబ్రవరి 3 నుంచి 15వ తేదీ వరకు సేకరించిన వివరాలను విశ్లేషించి తుది జాబితా విడుదల చేయనున్నారు.

పాటించాల్సిన జాగ్రత్తలు..

- సచివాలయ ఉద్యోగి, గ్రామ వలంటీర్ కలిసి ఇంటింటి సర్వేను ప్రారంభించారు. సర్వే ప్రారంభం నుంచి పూర్తయ్యేంత వరకు ఒకే మొబైల్ ఫోన్‌ను వినియోగించాలి. సర్వేకు కుటుంబ సభ్యుల నుంచి అనుమతిని తప్పక పొందాలి.
- జిల్లా స్థాయిలో టెక్నికల్ నోడల్ అధికార్, సహాయాధికారులను ప్రభుత్వం నియమించింది. సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు అధిగమించేందుకు వీరు సాయం చేయనున్నారు. ప్రత్యేక యాప్ ద్వారా డేటాను ఎంట్రీ చేస్తారు.
- కార్యదర్శులను క్లస్టర్ల వారీగా విభజించి వారికి వలంటీర్లను అనుసంధానం చేశారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, తహసీల్దార్, ఎంపీడీఓ తదితర మండల స్థాయి అధికారులను భాగస్వాములుగా డివిజన్, జిల్లా అధికారుల పర్యవేక్షణలో వలంటీర్ అప్లికేషన్ ద్వారా సర్వేను నిర్వహిస్తున్నారు. ఎనిమిదేళ్ల కంటే తక్కువ వయస్సున్న పిల్లల వివరాలనూ సేకరించడం ఒక్కరే ఇంట్లో ఉంటే కుటుంబం మొత్తం చనిపోయి ఉంటే సర్వే నిర్ధారణ కోసం సెక్రటేరియట్ ఉద్యోగి ఈ–కేవైసీని తప్పక ఇవ్వాలి.



నంద్యాల 26వ వార్డులో సర్వే నిర్వహిస్తున్న సచివాలయ అడ్మిన్, వార్డు వలంటీర్

వివరాల సేకరణ ఇలా...

- ఏ సామాజికవర్గానికి చెందిన వారు ఎంత మంది ఉన్నారో తెలుసుకొని, వారికి సంక్షేమ ఫలాలను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో సమగ్రకుల గణనను చేపడుతున్నారు.
- ఇందులో భాగంగా సదరు కుటుంబానికి సంబంధించిన సమగ్ర వివరాలను సేకరించనున్నారు. మొదట ఆ కుటుంబం నివసిస్తున్న జిల్లా, మండలం, గ్రామ వివరాలను సేకరిస్తారు. అనంతరం కుటుంబ పెద్ద, ఇంటి చిరునామా, గృహ వివరాలు, ఎంత మంది నివసిస్తున్నారనే వివరాలను నమోదు చేయనున్నారు. ఈ–కేవైసీకి లోబడి కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేస్తారు.
- ప్రతి వ్యక్తి పేరు, వయస్సు, భూమి (వ్యవసాయ, వ్యవసాయేతర), ఇంట్లోని పశువులు, వృత్తి, అన్ని రకాలుగా వచ్చే ఆదాయం, కులం, ఉప కులం, మతం, విద్యార్హత, నివాసం ఉండే ఇల్లు, మంచినీటి సదుపాయం, టాయిలెట్లు తదితర వివరాలను సేకరించాల్సి ఉంటుంది.



చాబోలులో కులగణన సర్వేపై సూచనలు ఇస్తున్న డీఎల్‌డీఓ మురళీకల్యాణి

అన్ని వర్గాలకు సమాన ఫలాలు



కుల గణన ద్వారా సమాజంలోని అన్ని వర్గాలు, కులాలకు దామాషా పద్ధతిన సంక్షేమ ఫలాలు అందనున్నాయి. జగనన్న ప్రభుత్వం సామాజిక న్యాయానికి కట్టుబడి ఉంది. రాష్ట్రంలో పదవులన్నింటిలో బీసీలకు 55 శాతాన్ని కేటాయించడం రాష్ట్ర చరిత్రలో ప్రథమం. కులగణన తర్వాత అన్ని వర్గాలకు సమాన న్యాయం జరుగుతుందనడంలో అతిశయోక్తి లేదు.

– శిల్పారవి చంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్యే, నంద్యాల

అపోహలొద్దు



కులాల వారీగా జనాభా, సామాజిక, విద్య, ఆర్థిక పరిస్థితులను తెలుసుకొని అర్హులకు సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందించేందుకు కులగణన దోహదపడుతుంది. కులగణనపై వచ్చే అపోహలకు ఆస్కారం లేదు. యాప్‌లో నమోదు చేసే సమాచారం పూర్తి భద్రత, గోప్యతతో ఉంటాయి. కులగణనను పక్కాగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టాం.

– రాహుల్‌కుమార్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్, నంద్యాల

బీసీలకు ప్రాధాన్యత



దేశ జనాభాలో 55 శాతం పైన ఉన్న బీసీలకు జనాభాకు తగ్గట్టుగా రిజర్వేషన్లు అమలు కావడం లేదు. రాజకీయాల్లో రిజర్వేషన్లు, ఉద్యోగాల్లో పదోన్నతులు దక్కడం లేదు. కుల గణన ఆధారంగా విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో రిజర్వేషన్లు అమలు అవుతాయి. సీఎం జగన్‌హన్‌రెడ్డి బీసీల పక్షపాతి. రాష్ట్రంలో పదవులన్నింటిలో బీసీలకు 50 శాతం కేటాయించారు. బీసీలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా బలోపేతమయ్యేందుకు కులగణన దోహదపడుతుంది. ప్రభుత్వం కుల గణన చేపట్టడం అభినందనీయం.

– గిరిబోయిన చంద్రశేఖర్, బెస్త సంఘం రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్, నంద్యాల

ఆర్‌యూను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా

- నూతన వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ సుధీర్ ప్రేమ్‌కుమార్



నూతన వీసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రొఫెసర్ సుధీర్ ప్రేమ్‌కుమార్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని వైస్ చాన్సలర్‌గా ప్రొఫెసర్ బి. సుధీర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. వర్సిటీ నూతన వీసీగా శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ సీవీ కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ వెంకట సుందరానంద పుచ్చ, ప్రొఫెసర్‌లు ఎన్.టి.కె. నాయక్, విశ్వనాథరెడ్డి, భరత్‌కుమార్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ హరిప్రసాద్‌రెడ్డి, వర్సిటీ బోధన, బోధనేతర ఉద్యోగులు వీసీని కలిసి బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. తనను వీసీగా నియమించిన రాష్ట్ర గవర్నర్, వర్సిటీల కులపతి ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఉన్నత విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జె. శ్యామలరావుకు కృతజ్ఞతలు తెలిపారు. రాయలసీమలోని జమ్మలమడుగు ప్రాంతానికి చెందిన వాడినని, ఈ ప్రాంత సమస్యలు, విద్యా వ్యవస్థ తీరుపై పూర్తి అవగాహన ఉందన్నారు. తన విద్యాభ్యాసం మొత్తం ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే సాగిందన్నారు. విద్యార్థుల కష్టనష్టాలు, ఇబ్బందులు అన్నీ తెలుసన్నారు. ఉన్నత ప్రమాణాలతో కూడిన బోధన అందించేందుకు కృషి చేస్తానన్నారు. హాస్టల్స్‌ను పరిశీలించి ఏ చిన్న సమస్య ఉన్నా పరిష్కరించి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తామన్నారు. వర్సిటీలో జాబ్‌మేళాలు నిర్వహించి విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. వర్సిటీలోని బోధన, బోధనేతర ఉద్యోగులు, విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తానన్నారు. ప్రభుత్వం తనకు ఇచ్చిన బాధ్యతను పూర్తి స్థాయిలో నిర్వర్తిస్తానని, వర్సిటీలో ప్రతి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు.

వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

- ఎస్పీ రఘువీర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: సాయుధ పోలీసు బలగాలు ఎప్పటికప్పుడు వృత్తి నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి అన్నారు. నంద్యాల జిల్లా సాయుధ పోలీసు బలగాలకు మొబలైజేషన్ కార్యక్రమాన్ని శుక్రవారం ఎస్పీ కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చట్ట పరిధిలో జరుగుతున్న మార్పులు, శాంతి భద్రతల్లో కొత్తగా తలెత్తే సమస్యల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎలాంటి అవరోధాలు ఏర్పడినా వాటిని అధిగమించే విధంగా నైపుణ్యాలు అలవరచుకోవాలన్నారు. ఏఆర్ సిబ్బంది విధులు ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని, విధులతో పాటు వ్యక్తిగత ఆరోగ్యానికి కూడా అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ మేరకు వైద్య శిబిరాలు, యోగా, ధ్యానం గురించి ప్రత్యేక తరగతులు నిర్వహించామన్నారు. విధి నిర్వహణలో ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తనని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషినల్ ఎస్పీ చంద్రబాబు, ఏఆర్ డీఎస్పీ రంగముని, డీపీఓ ఏఓ నిజాముద్దిన్, సూపరింటెండెంట్ ఖాదర్‌వలి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ లు సుధాకర్, శ్రీనివాసులు, మంజునాథ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతికి ఆస్కారమివ్వొద్దు

- జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

నంద్యాల: రెవెన్యూ అంశాల్లో అవినీతికి ఆస్కారమివ్వకుండా చిత్తశుద్ధితో పనులు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి ఆ శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ అంశాల్లో పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు ఫైళ్లు క్లియరెన్స్ చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఏపీ సెక్షన్లు, సిబ్బంది ఏపీ పనులు చేస్తున్నారని ఆరా తీస్తూ, ఫైళ్ల పెండింగ్ అంశంపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ పని తీరు మెరుగుపరుచుకోకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తాను జాయింట్ కలెక్టర్‌గా 5 నెలల నుంచి విధులు నిర్వహిస్తున్నానని ఇప్పటివరకు అతి ముఖ్యమైన దస్త్రాలు నా దృష్టికి రాలేదన్నారు. కొంత మంది రెవెన్యూ అధికారులు అవినీతికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని, ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తూ భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పురావృతమైతే సంబంధిత వ్యక్తులపై తీవ్ర కఠిన చర్యలు తప్పవని జేసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో డీఆర్‌ఓ పుల్లయ్య, అన్ని సెక్షన్ల సూపర్ సూపరింటెండెట్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో ఉమ్మడి కర్నూలు జిల్లా

- త్వరలో సీఎం చేతుల మీదుగా నేషనల్ లా యూనివర్సిటీకి శంకుస్థాపన
- చంద్రబాబు హయాంలో రోడ్లు భవనాల శాఖలో 'భవనాలు' మాయం
- జగనన్న పాలనలో 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్కిటెక్చర్ బోర్డు' ఏర్పాటు
- ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి



సబ్ కలెక్టర్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ జిలానీ, ఎంపీ పోచా, ఎమ్మెల్యే శిల్పా రవి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, పీపీ నాగిరెడ్డి, గంగుల ప్రభాకర్‌రెడ్డి

నంద్యాల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఉమ్మడి కర్నూలు జిల్లా అభివృద్ధి పథంలో నడుస్తుందని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. నంద్యాల పట్టణంలో రూ.1.6 కోట్లతో రీమోడల్ చేసిన సబ్ కలెక్టర్ భవనాన్ని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా బుగ్గన మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన సబ్ కలెక్టర్ భవనాన్ని అద్భుతంగా పునఃనిర్మించామని, భవనం చుట్టూ 5 ఎకరాల స్థలంలో ల్యాండ్ స్కేపింగ్ ద్వారా తోటలా మారుస్తామన్నారు. అభివృద్ధి ఏదని అవగాహన లేకుండా ప్రశ్నించే ప్రతిపక్షాలకు ఈ భవనం నిలువెత్తు నిదర్శనమన్నారు. జిల్లా ఏర్పాటైన వెంటనే అనేక ఇబ్బందుల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ నేతృత్వంలో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత నిస్తూ పరిపాలన అందించడాన్ని మంత్రి బుగ్గన అభినందించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నంద్యాలను జిల్లాగా చేసి అభివృద్ధికి చిరునామాగా మార్చామన్నారు. రూ.500 కోట్లతో నంద్యాలలో మెడికల్ కాలేజీని ఏర్పాటు చేశామన్నారు. నంద్యాల నుంచి ఆత్మకూరు, కొల్లాపూర్ మీదుగా హైదరాబాద్ వెళ్లే జాతీయ రహదారి, నంద్యాల నుంచి వైఎస్ఆర్ జిల్లాలోని జమ్ములమడుగుకు నేషనల్ హైవే, డోన్ నియోజకవర్గంలో జాతీయ రహదారి వంటి రూ. వేలకోట్లతో చేపట్టిన ప్రాజెక్టుల పనులు పరుగులు పెడుతున్నాయన్నారు. గాజులదిన్నె ప్రాజెక్టును 1 టీఎంసీ సామర్థ్యం పెంచడమే కాకుండా, గతంలో ఎన్నడూ లేని విధంగా 3 టీఎంసీల నీటిని గాజులదిన్నెకు ఈ ప్రభుత్వం కేటాయింపులు చేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. రూ.130 కోట్లతో కర్నూలులోని జగన్నాథ గట్టుపై జాతీయ న్యాయ విశ్వవిద్యాలయానికి త్వరలోనే సీఎం జగన్ చేతుల మీదుగా భూమి పూజ చేసేందుకు కసరత్తు జరుగుతోందన్నారు.



పునఃనిర్మించిన సబ్ కలెక్టర్ భవనం

ఆర్అండ్‌బీ శాఖకు పూర్వ వైభవం

రోడ్లు భవనాల శాఖలో 'భవనాల'ను టీడీపీ అధినేత చంద్రబాబు సమాధి చేశారని మంత్రి బుగ్గన విమర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నాయకత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా భవన నిర్మాణాల విషయంలో ఒకే రకమైన ప్రామాణికతను తీసుకువచ్చినట్లు ఆయన స్పష్టం చేశారు. అందుకోసం 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్కిటెక్చర్ బోర్డు' ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రోడ్లు భవనాల శాఖలో భవనాలు భాగమని నిరూపిస్తూ నంద్యాల జిల్లాలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టి ఆ శాఖకు పునర్ వైభవం తీసుకువచ్చామన్నారు. రూ.కోటితో నిర్మించిన సబ్ కలెక్టర్ కార్యాలయ పనుల్లో కాంట్రాక్టర్ తన బంధువని పనులు అప్పగించి అంచనా పెంచినట్లు ఓ వర్గం మీడియా అసత్య ప్రచారం చేయడంపై మంత్రి బుగ్గన ఖండించారు. కార్యక్రమంలో నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిశోర్ రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, నంద్యాల ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, జలవనరుల శాఖ సలహాదారు గంగుల ప్రభాకర్ రెడ్డి, మైనార్టీ సంక్షేమ శాఖ సలహాదారు హబీబుల్లా, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, నంద్యాల జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి, డీఆర్‌ఓ పుల్లయ్య, ఆర్‌డీఓ శ్రీనివాస్, ఆర్అండ్‌బీ జిల్లా ఇంజినీర్ శ్రీధర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ పీపీ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యం.. ఆరోగ్య భాగ్యం

ఇదీ మార్పు



ఇంజేడులో జగనన్న ఆరోగ్య సురక్షలో ఈసీజీ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పేదల ఆరోగ్య రక్షణే ప్రభుత్వ లక్ష్యమనేందుకు నిదర్శనం ఈ చిత్రం. గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వ చేపడుతున్న కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయి. ఇప్పటికే నాడు –నేడు కింద ఆసుపత్రుల రూపురేఖలు మార్చేసింది. ఓ వైపు అర్బన్ హెల్త్ సెంటర్లు, మరో వైపు విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, ఇంకో వైపు ఫ్యామిలీ ఫిజిషియన్ పేరుతో ఇంటింటికీ డాక్టర్, సచివాలయాల్లో హెల్త్ సెక్రటరీ నియామకం.. ఇలా ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రస్తుతం పేదల్లో ఆరోగ్య సమస్యలు ఉన్న వారిని గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రెండో విడుత కొనసాగుతోంది. శుక్రవారం ఇంజేడు గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 319 మందికి వైద్యాధికారులు చంద్రశేఖర్‌రెడ్డి, కిశోర్‌రెడ్డి, శివలింగమ్మలు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. గ్రామంలోనే గుండెకు సంబంధించి ఈసీజీ పరీక్షలు, కంటి చూపు పరీక్షలు, రక్త పరీక్షలు చేశారు. ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు పాల్గొని ఆరోగ్య సురక్ష కార్యక్రమ లక్ష్యాన్ని వివరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వర్లు, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గజ్జెల క్రిష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌బాబు, సచివాలయ ఉద్యోగులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

– ఉయ్యాలవాడ

క్లుప్తంగా

నేడు పగటి పూట త్రీఫేజ్ విద్యుత్ ఉండదు



కర్నూలు (అగ్రికల్చర్): జిల్లాలోని వివిధ మండలాల్లో శనివారం వ్యవసాయానికి పగటి పూట 3 ఫేజ్ విద్యుత్ ఇవ్వలేమని విద్యుత్ (ఆపరేషన్) ఎస్ఈ ఎం.ఉమాపతి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... కర్నూలు శివారులోని ఏపీ కార్బైడ్ 220 కెవి సబ్ స్టేషన్‌లో ఏపీ ట్రాన్స్‌కో అధికారులు 132 కేవీ లైన్ ఆధునికీకరణ పనులు చేపట్టడంతో వ్యవసాయానికి పగటి పూట విద్యుత్ ఇవ్వడం సాధ్యం కావడం లేదని పేర్కొన్నారు. కర్నూలు రూరల్ సబ్ డివిజన్ పరిధిలోని గూడూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం సబ్ డివిజన్ పరిధిలోని ఆదోని, ఆలూరు, పత్తికొండ సబ్‌డివిజన్ పరిధిలోని మండలాల్లోని అన్ని 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు పగటిపూట విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని పేర్కొన్నారు. అయితే లైటింగ్ సదుపాయం ఉంటుందని తెలిపారు. ఈ ప్రాంతాలకు శనివారం 6 గంటల తర్వాత త్రీఫేజ్ విద్యుత్ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ఒక్క రోజు జరుగుతున్న అంతరాయానికి రైతులు, వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు గమనించి సహకరించాలని కోరారు.

నేడు డీవైఈఓ, ఎంఈఓల సమావేశం

కర్నూలు కల్చరల్ : జిల్లాలోని ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యా శాఖ అధికారుల సమావేశం శనివారం ఉదయం 9 గంటలకు ఉల్చాల రోడ్డులోని ఎలుకూరు ఎస్టేట్ నారాయణ ఈఎం పాఠశాలలో జరుగుతుందని డీఈఓ వెంకటరంగారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 45 ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించినట్లు తెలిపారు. దీనికి సంబంధించి సర్వీసెస్ జాయింట్ డైరెక్టర్ సమీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు. విద్యాధికారులందరూ సమగ్ర వివరాలతో సమావేశానికి హాజరుకావాలని పేర్కొన్నారు.

డిగ్రీ పరీక్షలకు 43 మంది గైర్హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో శుక్రవారం జరిగిన డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షలకు 43 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వర్సిటీ పరీక్షల విభాగం డీన్ ఆచార్య నాగస్వరం నరసింహులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 67 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరుగుతుండగా ఉదయం సెషన్‌లో జరిగిన ఐదో సెమిస్టర్ పరీక్షలకు 645 మందికి గాను 602 మంది విద్యార్థులు హాజరు కాగా 43 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఎర్రగుంట్ల ప్రభుత్వ కళాశాలలో చూచిరాతకు పాల్పడిన ఒక విద్యార్థిని డిబార్ చేసినట్లు పేర్కొన్నారు.

పల్లె రోడ్లపై ప్రగతి 'శతకం'

రోడ్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. విరివిగా నిధులు మంజూరు చేస్తూ మారుమూల రహదారులను సైతం బాగు చేయిస్తోంది. పల్లె ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రగతి బాటలు నిర్మిస్తోంది. గ్రామ సీమలకు సరికొత్త దారులు వేస్తోంది. ఈ కోవలోనే ఉమ్మడి కర్నూలు జిల్లాలో వంద గ్రామాలకు రహదారి కష్టాలను తీర్చేందుకు పనులు ప్రారంభమయ్యాయి. రోడ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసేందుకు ఇంజినీర్లు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు.

- ఉమ్మడి కర్నూలు జిల్లాలో వంద గ్రామాలకు రోడ్ల అభివృద్ధి
- రూ.270.77 కోట్లు ఖర్చు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- బాగుపడనున్న 466.79 కిలోమీటర్ల రహదారులు
- మొత్తం 64 పనుల్లో ఇప్పటికే 24 పనులు ప్రారంభం
- పీఆర్, ఆర్అండ్‌బీ శాఖల ఆధ్వర్యంలో రోడ్ల నిర్మాణం



కేకే కొట్టాల నుంచి బేతంచెర్ల రోడ్డుపై బ్రిడ్జి నిర్మిస్తున్న దృశ్యం



డీఆర్ రోడ్ నుంచి పెద్దపాయ వరకు వేసిన రోడ్డును పరిశీలిస్తున్న పీఆర్ ఇంజినీర్లు

కర్నూలు(అర్బన్): అత్యధిక శాతం మంది ప్రజలకు ఉపయోగపడే రోడ్ల పనులను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ఐదు హైఇంపాక్ట్ రోడ్లుగా గుర్తించి వాటిని నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సీఎంఓ నుంచి ప్రత్యేక ఆదేశాలు అందాయి. దీంతో పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ శాఖల ఆధ్వర్యంలో 64 రోడ్లను గుర్తించారు. మొత్తం 466.79 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేసేందుకు పాలనా అనుమతులు పొందారు. ఆయా రోడ్లను యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి చేసేందుకు ఆయా శాఖలు ప్రత్యేక కార్యాచరణను రూపొందించుకున్నాయి. క్షేత్ర స్థాయిలో పనులను సైతం ప్రారంభించాయి. ఈ రోడ్లు బాగుపడితే దాదాపు వంద గ్రామాల రహదారి కష్టాలు తీరనున్నాయి.

24 పనులు ప్రారంభం

పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లాలో 11, నంద్యాల జిల్లాలో 28 రోడ్లను హైఇంపాక్ట్ రోడ్లుగా గుర్తించారు. వీటి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిన వెంటనే పనులు చేపట్టేందుకు ఆమోదం లభించింది. ఈ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.187.27 కోట్లతో పాలనా అనుమతులు మంజూరు చేసింది. ఇందుకు సంబంధించి పీఆర్అండ్ఆర్‌డీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బీ రాజశేఖర్ గత ఏడాది అక్టోబర్ 30వ తేదిన జీఓఆర్‌టీ నెంబర్: 726ను జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే పాలనా అనుమతులు లభించిన ఆయా పనులను ప్రారంభించి వేగంగా పూర్తి చేసేందుకు పీఆర్ ఇంజినీరింగ్ వర్గాలు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మొత్తం 39 పనులకు సంబంధించి రెండు జిల్లాల్లో 24 పనులు ప్రారంభం కాగా, మిగిలిన 15 పనులు టెండర్ దశలో ఉన్నాయి. టెండర్ దశలో ఉన్న వాటిని కూడా పురోగతిలోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టారు. పనులు పూర్తి అయితే ఉమ్మడి జిల్లాలో 257.79 కిలోమీటర్ల మేర గ్రామీణ రోడ్లు అభివృద్ధి చెందనున్నాయి.

రూ.83.50 కోట్లతో ఆర్అండ్‌బీ రోడ్ల అభివృద్ధి

ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలోని స్టేట్ హైవేస్, మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లలో పూర్తి అధ్వానంగా తయారైన వాటిని హైఇంపాక్ట్ రోడ్లుగా గుర్తించారు. ఈ నేపథ్యంలోనే ఆర్అండ్‌బీ ఇంజినీర్లు ఉమ్మడి కర్నూలు జిల్లాలో 16 మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లు, 9 స్టేట్ హైవేస్‌ను గుర్తించారు. వీటిని బాగు చేసేందుకు రూ.83.50 కోట్లతో అంచనాలు రూపొందించారు. మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లకు సంబంధించి రూ.47 కోట్ల అంచనాతో గుర్తించిన 16 రోడ్ల పనుల్లో ఇప్పటికే 14 పనులకు టెండర్లు పూర్తి అయ్యాయి. రెండు పనులకు టెండర్లు పూర్తి కాలేదు. టెండర్లు పూర్తి అయిన వాటిలో రెండు పనులకు అగ్రిమెంట్ కూడా పూర్తయ్యింది. మిగిలిన 12 పనులకు కూడా వెంటనే అగ్రిమెంట్ పూర్తి చేసి పనులను ప్రారంభించేందుకు ఇంజనీర్లు చర్యలు చేపట్టారు. స్టేట్ హైవేస్‌కు సంబంధించి రూ.36.50 కోట్లతో 9 హై ఇంపాక్ట్ రోడ్ల పనులను చేపట్టనున్నారు. ఇందులో కర్నూలు జిల్లాలో మూడు, నంద్యాల జిల్లాలో ఆరు రోడ్లు ఉన్నాయి. ఈ పనులకు ఇప్పటికే టెండర్లతో పాటు అగ్రిమెంట్లు కూడా పూర్తి అయ్యాయి. ఇందులో నాలుగు పనులకు లెటర్ ఆఫ్ యాక్సెప్టెన్సీ (ఎల్ఓఏ) కూడా ఇచ్చారు. ఆర్అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాల మేరకు ఈ పనులను ప్రారంభించేందుకు సంబంధిత ఇంజనీర్లు చర్యలు చేపట్టారు. ఈ పనుల్లో భాగంగా 1/600 కి.మీ నుంచి 2/0 కి.మీ వరకు డోన్ – రాయలచెరువు రోడ్డు పనిని ఇప్పటికే పూర్తి చేశారు.

మెరుగుపడనున్న రాకపోకలు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో 11 నియోజకవర్గాల పరిధిలో రూ.189.27 కోట్లతో 39 పనులను చేపట్టనున్నారు. ఈ పనులు పూర్తి అయితే 257.79 కిలోమీటర్ల మేర గ్రామీణ రోడ్లు అభివృద్ధి చెందనున్నాయి. ఈ రోడ్ల పనులు పూర్తి అయితే ఆయా నియోజకవర్గాల్లోని అనేక గ్రామాల ప్రజల రాకపోకలకు మార్గం సుగమం అవుతుంది.

నిధుల కొరత లేదు



ప్రభుత్వం ఆమోదించిన హైఇంపాక్ట్ రోడ్ల పనులను నిర్ణీత సమయంలోగా పూర్తి నాణ్యతతో పూర్తి చేయనున్నాం. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో మొత్తం 39 రోడ్లలో 24 రోడ్ల పనులు ప్రారంభం అయ్యాయి. ఈ రోడ్ల పనులు పూర్తి అయితే అనేక గ్రామాల ప్రజల రవాణా సౌకర్యాలకు ఉన్న ఇబ్బందులు తొలగిపోనున్నాయి. ఈ పనులకు ఎలాంటి నిధుల కొరత లేదు. ఆయా నియోజకవర్గాల్లోని ప్రజా ప్రతినిధులు కూడా ఈ పనులను వేగంగా పూర్తి చేయించేందుకు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. – కే సుబ్రమణ్యం, పీఆర్ ఎస్ఈ

టెండర్లు పూర్తి అయిన పనులను చేపట్టనున్నాం



ఉమ్మడి కర్నూలు జిల్లాలో హైఇంపాక్ట్‌గా గుర్తించిన రోడ్ల పనులను వెంటనే చేపట్టాలని ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే ఈ పనులకు సంబంధించి ఒకటి, రెండు మినహా అన్ని పనులకు టెండర్లు పూర్తి అయ్యాయి. వెంటనే అగ్రిమెంట్లు కూడా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాం. జిల్లాలోని వివిధ రోడ్ల మరమ్మతులకు కూడా రూ.3.47 కోట్లలో అంచనాలు రూపొందించి ప్రతిపాదలను ప్రభుత్వానికి పంపించాం. – ఆర్ నాగరాజు, ఆర్అండ్‌బీ ఎస్ఈ

ఓటరు తుది జాబితా ప్రచురణకు సిద్ధం

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ మనజీర్ జిలానీ, జేసీ తదితరులు

నంద్యాల: భారత ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు ఓటరు ప్రత్యేక సవరణ తుది జాబితా ప్రచురణకు అంతా సిద్ధం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ రాష్ట్ర చీఫ్ ఎలెక్ట్రోరల్ అధికారి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు వివరించారు. శుక్రవారం విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమం ద్వారా స్వీకరించిన ఫారమ్‌లు, ముసాయిదా జాబితాపై ఓట్ల చేర్పులు, తొలగింపులు, సవరణలు, పోలింగ్ అధికారుల నియామకం, రాజకీయ పార్టీల ఫిర్యాదులు, ఈరోల్‌పై రిపోర్ట్‌లు, పీఎస్ఈలు, డీఎస్ఈలు, ఈవీఎంల భద్రతా గదులు తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాని ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. నంద్యాల నుంచి జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్ఓ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ ఫారం – 7 ద్వారా అందిన అభ్యంతరాలపై సమగ్ర విచారణ చేసి తప్పులు లేని ఓటర్ల తుది జాబితా రూపకల్పనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను సూచించారు. ఎన్నికల నిర్వహణలో పాల్గొనే అధికారులకు, సిబ్బందికి ఎన్నికల ప్రక్రియ నిర్వహణ నియమ నిబంధనలపై శిక్షణ నిచ్చేందుకు జిల్లా ఎన్నికల అధికారులు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణలో భాగంగా అభ్యంతరాలపై అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి ఈనెల 22వ తేదీ పారదర్శక, నిష్పక్షపాత ఓటర్ల జాబితా రూపకల్పనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఈఆర్వోలను ఆదేశించారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో ర్యాంపులు, టాయిలెట్స్ తాగునీరు, ఫర్నిచర్, విద్యుత్ సౌకర్యం, లైటింగ్ తదితర మౌలిక సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. నియోజకవర్గాలలో ఈవీఎంల వినియోగంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రతి అంశాన్ని సంబంధిత అధికారులు సీరియస్‌గా తీసుకొని పనులు చేపట్టాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నంద్యాల, ఆత్మకూరు, డోన్ ఆర్‌డీఓలు శ్రీనివాసులు, ఎం.దాసు, వెంకటరెడ్డి, అన్ని నియోజకవర్గాల ఈఆర్వోలు, ఎన్నికల విభాగపు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- జేసీ నారపురెడ్డి మౌర్య



రాజకీయ పార్టీ నాయకులతో మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య

గడివేముల/పాణ్యం: ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందిస్తున్నామని, యువజనులందరూ ఓటు ఉందో లేదో పరిశీలించుకోవాలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య సూచించారు. శుక్రవారం ఆమె పాణ్యం రెవెన్యూ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. అలాగే గడివేముల మండలంలోని బూజునూరు, పెసరవాయి, కరిమద్దెల గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఓటర్ల నుంచి వచ్చిన ఫిర్యాదులను త్వరగా విచారించి, పరిష్కరించాలని అధికారులకు ఆమె సూచించారు. బీఎల్ఓలు విధులను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పాణ్యం మండలం గగ్గటూరు, ఎస్. కొట్టాలలో కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటును పరిశీలిస్తామని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్లు శ్రీనివాసులుగౌడ్, శివప్రసాదరెడ్డి, శ్రీనివాసులు, రమేష్‌బాబు, పాణ్యం జెడ్పీటీసీ మాజీ సభ్యులు సద్దల సూర్యనారాయణరెడ్డి, పాణ్యం ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే డబ్లింగ్ పనుల పరిశీలన



నంద్యాల రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్‌డీజీఎం

నంద్యాల(సిటీ): గుంతకల్లు – గుంటూరు డివిజన్ల మధ్య జరుగుతున్న రైల్వే డబ్లింగ్ పనులను సౌత్ సెంట్రల్ రైల్వే ఎస్‌డీజీఎం అరవింద్ మాల్‌ఖేడే శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉదయం డోన్ నుంచి వచ్చిన ఆయన నంద్యాల రైల్వే స్టేషన్ మీదుగా గిద్దలూరు, జగ్గంబొట్ల కృష్ణాపురం రైల్వే స్టేషన్ల వరకు జరిగిన రైల్వే డబ్లింగ్ పనులను పరిశీలించారు. మోటార్ ట్రాలీలో ప్రయాణిస్తూ రైల్వే ట్రాక్ స్థితిగతులను నిశితంగా తనిఖీ చేశారు. రాత్రి నంద్యాల రైల్వే స్టేషన్‌ను చేరుకుని పరిసరాలను పరిశీలించి మరింతగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నంద్యాల రైల్వే స్టేషన్‌లో కల్పించాల్సిన మౌలిక వసతులపై మేనేజర్ దొరస్వామికి పలు సూచనలు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం



డోన్ రూరల్: చిన్నమల్కాపురం గ్రామ సమీపంలో గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం చెందాడు. గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. మృతుడు వయస్సు 35–40 సంవత్సరాల మధ్య ఉంటుందని, నారింజ, నీలం రంగు గళ్ల చొక్కా, నీలవరంగు షాట్, ఎడమ చేతికి ఎర్రటి తాయత్తు ఉందన్నారు. మృతదేహాన్ని డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, మృతుని ఆచూకీ తెలిసిన వారు డోన్ రూరల్ ఎస్ఐ 9121101116, సీఐ 9121101115కి సమాచారం ఇవ్వాలన్నారు.

బాలికపై పెదనాన్న అత్యాచారం

ఆత్మకూరు రూరల్: ఓ బాలికపై సొంత పెదనాన్న అత్యాచారానికి పాల్పడిన ఘటన ఆత్మకూరు మండలం కొత్తరామాపురం గ్రామంలో చోటు చేసుకుంది. సంచార జాతికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు ఆవులను మేపుతూ జీవనం సాగిస్తున్నారు. మైనర్ బాలిక అయిన తమ్ముడు కూతురిపై పెదనాన్న కన్నువేశాడు. శుక్రవారం ఉదయం ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో బాలిక ఒంటరిగా ఉండడం గమనించి లైంగికదాడికి పాల్పడ్డాడు. కొద్ది సేపటి తర్వాత ఇంటికొచ్చిన తల్లికి తీవ్ర నొప్పితో బాధపడుతున్న బాలికను చూసి అనుమానించి ఆరా తీయగా విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో బాలిక తల్లి నేరుగా ఆత్మకూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి, బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

జాతీయ సదస్సులో జెడ్పీ చైర్మన్



జాతీయ సదస్సులో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి, సీఈఓ, డీపీఓ తదితరులు

కర్నూలు(అర్బన్): తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వ విద్యాలయంలో 'హెల్తీ విలేజ్' (ఆరోగ్య గ్రామాలు) అనే అంశంపై ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభమైన జాతీయ సదస్సుకు జిల్లా పరిషత్ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి హాజరయ్యారు. ప్రజల జీవన ప్రమాణాల పెంపులో భాగంగా సుస్థిర లక్ష్యాల సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ సదస్సును నిర్వహిస్తోంది. ఈ సదస్సుకు కేంద్ర పంచాయతీరాజ్ శాఖ సహాయ మంత్రి కపిల్ మోరేశ్వర్ పాటిల్, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడుతో పాటు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, పీఆర్అండ్ఆర్‌డీ అధికారులు పాల్గొన్నారు. ఆరోగ్య గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ఉత్తమ విధానాలను అన్ని రాష్ట్రాల్లో అమలు చేసేందుకు చర్యలు చేపట్టే అవకాశాలను ఈ సదస్సులో చర్చిస్తున్నారు. ఈ సదస్సుకు ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి టీ నాగరాజు నాయుడు, పలువురు డీఎల్‌పీఓలు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ఎంపీడీఓలు, ఈఓఆర్‌డీలు, ఆశావర్కర్లు, సచివాలయాల్లోని మహిళా పోలీసులు, జిల్లా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

కందులకు పెరిగిన డిమాండ్


- మార్కెట్ ధరతో కొనుగోలుకు ముందుకొచ్చిన నాఫెడ్

కర్నూలు(అగ్రికల్చర్): బహిరంగ మార్కెట్‌లో కందుల ధర ఎక్కువగా ఉండటంతో మార్కెట్ ధరకే కొనుగోలు చేసేందుకు నాఫెడ్ జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ, మార్క్‌ఫెడ్‌లను రంగంలోకి దింపింది. మరోవైపు పౌరసరఫరాల సంస్థ కూడా మార్కెట్ ధరకు అనుగుణంగా కందుల కొనుగోలు ప్రక్రియను చేపట్టింది. బహిరంగ మార్కెట్‌లో కందుల ధర క్వింటా రూ.10వేల పైనే పలుకుతోంది. డీసీఎంఎస్ గరిష్టంగా రూ.9,385 ధరతో ఇప్పటి వరకు 9,400 క్వింటాళ్లు కొనుగోలు చేసింది. రోజు వారీగా వచ్చే కందుల ధర రైతులకు గిట్టుబాటు కావడం లేదనే కారణంతో మూడు రోజులుగా కొనుగోళ్లు నిలిపేసింది. ఈ నేపథ్యంలో శుక్రవారం జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య వ్యవసాయ, రెవెన్యూ యంత్రాంగం, డీసీఎంఎస్, మార్క్‌ఫెడ్, పౌరసరఫరాల సంస్థ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి కందుల కొనుగోలుపై సమీక్ష నిర్వహించారు. 2023–24లో కంది సాగు చేసి ఈ–క్రాప్‌లో నమోదై ఈ–కేవైసీ చేయించుకున్న రైతుల నుంచి మార్కెట్ ధరతో కందుల కొనుగోలు ప్రక్రియను చేపట్టాలని సూచించారు.

ఆస్తి కోసం కన్న తల్లిని హతమార్చిన కొడుకు



మృతి చెందిన లక్ష్మీదేవి



లక్ష్మీదేవి (ఫైల్)

తుగ్గలి: ఆస్తి కోసం కన్న తల్లినే హతమార్చిన ఘటన మండలంలోని రాతన కొత్తూరులో చోటు చేసుకుంది. తుగ్గలి పోలీసులు తెలిపిన వివరాలివీ.. గ్రామానికి చెందిన పచ్చర్లపల్లి లక్ష్మీదేవి(44), కృష్ణారెడ్డి దంపతులకు కుమార్తె, కుమారుడు సంతానం. కూతురు మాధవికి వివాహం కాగా కుమారుడు లిఖిత్‌కుమార్‌రెడ్డికి 20 ఏళ్ల వయస్సు. ఏడేళ్ల క్రితం భర్త చనిపోగా లక్ష్మీదేవి రాతనలో ఉంటున్న తన తల్లి హనుమంతమ్మ వద్దకు చేరుకుంది. అప్పుడప్పుడు ఆర్.కొత్తూరుకు వచ్చివెళ్లేది. వీరికి 11 ఎకరాల భూమి ఉండగా.. లక్ష్మీదేవి పేరిట ఐదెకరాలు, మిగిలిన పొలం లక్ష్మీదేవి, లిఖిత్ పేరిట సంయుక్తంగా ఉంది. కుమారుడు గ్రామంలోనే తన పెదనాన్న లింగారెడ్డి ఇంట్లో ఉంటూ వ్యవసాయం చేస్తున్నాడు. ఆస్తి తన పేరిట లేకపోవడం, తల్లి కూడా స్థానికంగా ఉండకపోవడంతో లిఖిత్‌ను మానసికంగా దెబ్బతీసింది. ఈ నేపథ్యంలోనే ఎలాగైనా పొలం తన పేరిట చేయించుకోవాలనుకున్నాడు. తనకు పెళ్లి చూపులు ఉన్నాయని, ఊరికి రావాలని తల్లికి సమాచారం ఇవ్వడంతో ఆమె గురువారం ఆర్.కొత్తూరుకు చేరుకుంది. రాత్రి ఏం జరిగిందో తెలియదు కానీ, శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో రక్తపుమడుగులో కనిపించింది. గుంటిక మేడతాకతో ఆమె తలపై బాదిన ఆనవాళ్లను గుర్తించారు. కుమారుడే ఈ ఘతుకానికి పాల్పడి పరారయ్యాడని స్థానికులు చెబుతున్నారు. బలమైన గాయం కావడంతో ఆమె అక్కడికక్కడే మరణించింది. విషయం తెలుసుకున్న పత్తికొండ రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ మల్లికార్జున ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పెదనాన్న లింగారెడ్డి ప్రోద్బలంతోనే లిఖిత్ ఈ దారుణానికి ఒడిగట్టాడని మృతురాలి తల్లి హనుమంతమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు లింగారెడ్డి, లిఖిత్‌లపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరో 22 మంది ఎస్ఐలకు స్థానచలనం

కర్నూలు: పోలీసు శాఖలో బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. నెలాఖరులోగా అధికారుల బదిలీలు, పోస్టింగులు పూర్తి చేయాలనే కేంద్ర ఎన్నికల సంఘం సూచన మేరకు పోలీసు శాఖలో విడతల వారీగా బదిలీలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా 22 మంది ఎస్ఐలకు స్థానచలనం కల్పిస్తూ శుక్రవారం ఎస్పీ కృష్ణకాంత్ ఉత్తర్వులు జారీ చేశారు. 9 మంది ఎస్ఐలను రేంజ్ వీఆర్‌కు పంపుతూ ఉత్తర్వులు జారీ కాగా, పొరుగు జిల్లాల్లో పనిచేస్తున్న వారి అటాచ్‌మెంట్లను రద్దు చేస్తూ స్థానచలనం కల్పించారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
పి.శోభారాణి	వీఆర్, కర్నూలు	ఏపీస్టేట్‌హ్యూమన్‌రైట్స్‌కమిషన్,కర్నూలు
పి.మహమ్మద్ అలీఖాన్	కర్నూలు తాలూకా యూపీఎస్	రేంజ్ వీఆర్, కర్నూలు
ఎస్.సోమ్లా నాయక్	అటాచ్‌మెంట్, కె.నాగలాపురం	రేంజ్ వీఆర్, కర్నూలు
జి.మల్లికార్జున	డీటీసీ, కర్నూలు	రేంజ్ వీఆర్, కర్నూలు
ఎం.సి.రంగయ్య	డీఎస్‌బీ, కర్నూలు	రేంజ్ వీఆర్, కర్నూలు
బి.పుల్లన్న నాయక్	పీసీఆర్, కర్నూలు	రేంజ్ వీఆర్, కర్నూలు
పి.నిర్మలా దేవి	పీసీఆర్, కర్నూలు	రేంజ్ వీఆర్, కర్నూలు
డి.సి.హెచ్.పుల్లయ్య	పీసీఆర్, కర్నూలు	రేంజ్ వీఆర్, కర్నూలు
బి.ఉమాపతి	డీసీఆర్‌బీ, కర్నూలు	రేంజ్ వీఆర్, కర్నూలు
సి.హెచ్.వెంకటరమణ	వీఆర్, కర్నూలు	రేంజ్ వీఆర్, కర్నూలు
బి.వి.రమణ రావు	కర్నూలు త్రీటౌన్ పీఎస్	రేంజ్ వీఆర్, కర్నూలు
వై.సుబ్బరాయుడు	వీఆర్, కర్నూలు	రేంజ్ వీఆర్, కర్నూలు
ఆశా బేగం	అటాచ్డ్, నంద్యాల జిల్లా	రేంజ్ వీఆర్, కర్నూలు
ఆర్.శ్రీనివాసులు	అటాచ్డ్, నంద్యాల జిల్లా	రేంజ్ వీఆర్, కర్నూలు
ఎస్.ఎ.రవూఫ్	అటాచ్డ్, నంద్యాల జిల్లా	రేంజ్ వీఆర్, కర్నూలు
ఎస్.జాకీర్ హుసేన్	అటాచ్డ్, అన్నమయ్య జిల్లా	సీసీఎస్, అన్నమయ్య జిల్లా
ఎస్.ఎం.డి.జాఫర్ హుసేన్	కర్నూలు వన్‌టౌన్ పీఎస్	పీసీఆర్, కర్నూలు
ఎ.అంజాద్ వలి	అటాచ్డ్, అనంతపురం జిల్లా	వీఆర్, కర్నూలు
కె.సి.తిరుపాల్	అటాచ్డ్, అనంతపురం జిల్లా	వీఆర్, కర్నూలు
ఎం.వెంకటాచలపతి	అటాచ్డ్, అనంతపురం జిల్లా	పీటీసీ, అనంతపురం
ఎ.రామకృష్ణయ్య	అటాచ్డ్, అనంతపురం జిల్లా	వీఆర్, కర్నూలు
కె.రాజ కుళ్లాయప్ప	అటాచ్డ్, చిత్తూరు జిల్లా	వీఆర్, కర్నూలు